# రాష్ట్రంలో కొరియా నౌకా నిర్మాణం

- అమరావతిలో దక్షిణ కొరియా పారిశ్రామిక ప్రాంతం
- ఆటోమొబైల్, ఆహార తయారీ, నిర్మాణ రంగాలలో పెట్టుబడులకు ఆసక్తి
- సీఎం చంద్రబాబుతో సమావేశమైన 'బుసాన్' బృందం



సీఎం చంద్రబాబుతో సమావేశమైన కొరియా ప్రతినిధులు

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దక్షిణ కొరియా పారిశ్రామిక సంస్థలు నౌకా నిర్మాణం విభాగాన్ని స్థాపించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. నీటి శుద్ధి ప్రక్రియ సాంకేతికను అందించటానికి బుసాన్ బృందం ముందుకొచ్చింది. రాష్ట్రంలో ప్రధానంగా ఆహార, వస్త్ర తయారీ పరిశ్రమలు, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, నిర్మాణ రంగం, నౌకా నిర్మాణ రంగాలపై ఈ బృందం ప్రధానంగా దృష్టి సారించింది. దక్షిణ కొరియాలోని భారత రాయబారి జియాంగ్ డాక్ మిన్ నేతృత్వంలో బుసాన్ పారిశ్రామికవేత్తలతో కూడిన 20మంది సభ్యుల బృందం సోమవారం ఉండవల్లి ప్రజా వేదికలో సీఎం చంద్రబాబుతో భేటీ అయింది. రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెడతామంటూ హామీ ఇచ్చింది. రాష్ట్రంలో 974 కిలో మీటర్ల పొడవైన సముద్ర తీర ప్రాంతం... భారీ, చిన్నతరహా ఓడరేవులు ఉన్నందున రాష్ట్రంలో లక్షలాది మందికి ఉపాధిని కల్పించేలా షిప్ బిల్డింగ్ యూనిట్‌ను స్థాపించేందుకు సుముఖంగా ఉన్నామని బుసాన్ పారిశ్రామిక బృందం తెలిపింది. శ్రీకాకుళం జిల్లాలో ఈ యూనిట్‌ను పెట్టే ఆలోచనలో ఉన్నామని, ఇప్పటికే దీనిపై కసరత్తు చేశామని ఆ ప్రతినిధులు వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "దక్షిణ కొరియా, ఆంధ్రప్రదేశ్‌లకు పలు అంశాలలో సారూప్యత ఉంది. రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి" అన్నారు. రాష్ట్రంలో కొరియా పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసేందుకు గతంలో అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్న విషయాన్ని సీఎం గుర్తు చేశారు. రాష్ట్రంలో అంతర్గత జల రవాణా వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో కొరియన్ పారిశ్రామిక నగరం ఏర్పాటు చేయాలని బుసాన్ బృందాన్ని కోరిన ముఖ్యమంత్రి అమరావతిలోనూ దక్షిణ కొరియా పారిశ్రామిక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలో షిప్ బిల్డింగ్ యూనిట్‌ను స్థాపించాలని బూసాన్ పారిశ్రామిక బృందం ముందుకు రావడాన్ని సీఎం ఆహ్వానించారు. సముద్ర రవాణాలో దేశంలోనే ఏపీ రెండో స్థానం సాధించిందని చెప్పారు. రాష్ట్రం నుంచి మూడు రాష్ట్రాలకు అంతర్గత జల రవాణా మార్గాల్లో సరుకు రవాణాకు ఆస్కారం ఉందన్నారు. సీఎం చంద్రబాబుకు కొరియన్ పారిశ్రామికవేత్తల బృందాన్ని ఈడీబీ సీఈవో కృష్ణ కిశోర్ పరిచయం చేశారు. సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

## సొమ్మసిల్లిన కొరియన్ ప్రతినిధి

భేటీలో భాగంగా కొరియన్ ప్రతినిధులను వ్యక్తిగతంగా సీఎం చంద్రబాబు సన్మానించారు. ఆ తర్వాత సీఎం అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ సమయంలో కొరియన్ పారిశ్రామిక ప్రతినిధి ఒకరు సొమ్మసిల్లి పడిపోయారు. ఉన్నపళంగా పడిపోవడంతో ఆ పారిశ్రామికవేత్త దవడకు గాయమైంది. సీఎం నివాసంలో ఉండే వైద్యులు వెంటనే ఆయనకు కుట్లు వేసి ప్రాథమిక చికిత్స అందించారు. ఆ వెంటనే మంత్రి అమరనాథరెడ్డి హుటాహుటిన ఆ ప్రతినిధిని విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ఆంధ్రజ్యోతి Tue, 23 October 2018
epaper.andhrajyothy.com/c/33324561